క్లుప్తంగా

రోడ్డు విస్తరణకు రూ.8.50 కోట్లు మంజూరు

రామన్నపేట : రామన్నపేట మండల కేంద్రంలో రోడ్డు విస్తరణతోపాటు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.8.50కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో అంబేద్కర్ చౌరస్తా (నలంద జూనియర్ కళాశాల) నుంచి కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వరకు, సుభాష్ సెంటర్ నుంచి గాంధీచౌక్ వరకు రోడ్డు విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. నాలుగేళ్లలో రూ1.50కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు, మరో రూ.50లక్షలతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. నిధుల మంజూరుకు సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రులు జగదీశ్‌రెడ్డి, కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారి సంతకం ఫోర్జరీ

- వేరే వ్యక్తులకు నియామక ఉత్తర్వులు అందించిన డీపీఓ

భువనగిరి : డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంతకాలు ఫోర్జరీ చేసి ముందుగా ఇచ్చిన వ్యక్తులు కాకుండా వేరే ఇద్దరికి ఆర్డర్ కాపీ ఇచ్చిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల చివరి వారంలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో విధులు నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇద్దరికి నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వీరికి ఇవ్వాల్సిన ఉత్తర్వుల కాపీని వేరొక ఇద్దరికి ఇచ్చేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీపీఓగా విధులు నిర్వహిస్తున్న మాధవి డీఎంహెచ్‌ఓ సంతకాలను ఫోర్జరీ చేసి ఉత్తర్వులు అందజేసింది. ఈ విషయాన్ని గత నెల 31వ తేదీన గమనించిన డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు శనివారం మాధవికి మెమో జారీ చేసి కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరేట్‌కు సరెండర్ చేసినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు.

53 మందికి జరిమానా

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 53మందికి ఆలేరు జెఎఫ్‌సీఎం కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ శివశంకర్‌గౌడ్ శనివారం తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.2వేల చొప్పున రూ.1,06,000ల జరిమానా వేశారు. ఇందులో 21 ద్విచక్ర వాహనాలు, 32 ఫోర్ వీల్లర్స్ ఉన్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో భాగంగా కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

వలిగొండ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రెడ్లరేపాకకు చెందిన పంతంగి శ్వేత (35) వారం రోజుల క్రితం తన భర్త శ్రీనివాస్ తో కలిసి బైక్‌పై వలిగొండ నుంచి రెడ్లరేపాకకు వెళుతుండగా వలిగొండ సమీపంలో ప్రమాదవశాత్తు జారీ కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

ఆలేరురూరల్ : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడడంతో ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆలేరు మండలంలోని టంగుటూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దూసరి శ్రీనివాస్ శనివారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. గమనించిన తోటి గీత కార్మికులు ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా లింగస్వామి



భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన గోదాసు లింగస్వామి బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యామ్‌సుందర్‌రావు ఆదేశాల మేరకు శనివారం ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దుర్గపతి లక్ష్మీనారాయణ లింగస్వామికి నియామక పత్రాన్ని అందజేశారు. తననియామకానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఒలింపియాడ్‌లో జీనియస్ విద్యార్థుల ప్రతిభ

భువనగిరి : గతనెలలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్ పరీక్షల్లో పట్టణంలోని జీనియస్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఇష్క 3వ ర్యాంకు, పి అక్షయ్య 13వ ర్యాంకు, అమీన బసీరత్ 26వ ర్యాంకు సాధించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో ఎనిమిది మంది విద్యార్థులు ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఏవో రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువైద్యుడు లేక ఇబ్బందులు

- మోత్కూరు మండలంలో పశువైద్యశాల కరువు
- దత్తప్పగూడెం సబ్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్
- నూతన భవన నిర్మాణానికి ఆయిల్ ఫెడ్ నుంచి రూ.10లక్షలు మంజూరు



దత్తప్పగూడెంలో నిర్మాణంలో ఉన్న వెటర్నరీ సబ్ సెంటర్ భవనం

మోత్కూరు : దత్తప్పగూడెం వెటర్నరీ సబ్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ మండల స్థాయి ఆస్పత్రిగా మార్చాలని మండల రైతులు, జీవాల పెంపకందారులు కోరుతున్నారు. డాక్టర్ పోస్టులేక రైతులు, జీవాల యజమానులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోత్కూరు ఉమ్మడి మండలం పరిధిలో అడ్డగూడూర్ వెటర్నరీ ఆస్పత్రికి మండల స్థాయి డాక్టర్ పోస్టు ఉంది. నూతన మండలాల ఏర్పాటులో భాగంగా అడ్డగూడూర్ ప్రత్యేక మండలంగా విడి పోయింది. దీంతో మోత్కూరు మండల వెటర్నరీ డాక్టర్ పోస్టు లేకుండా పోయింది. మండల పరిధిలో 1682 ఆవులు, 4327 గేదెలు, 18520 గొర్రెలు, 2025 మేకలు ఉన్నాయి. డాక్టర్ పోస్టు లేక పోవడంతో పశువులు, జీవాలకు వైద్య సేవలు అందించే వారు లేకపోవడంతో పాటు ప్రభుత్వ పరంగా వచ్చే వివిధ రకాల సబ్సిడీ పథకాలు, డాక్టర్ ధ్రువీకరణ సంతకాలు చేసే వారు లేక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఆత్మకూరు(ఎం), మండల కూరెళ్ల పశువుల ఆస్పత్రి డాక్టర్ వల్లాల సంతోష్‌కుమార్‌ను మోత్కూరు మండల ఇన్‌చార్జ్ డాక్టర్‌గా నియమించారు. దత్తప్పగూడెం సబ్‌సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ డాక్టర్ పోస్టు ఆస్పత్రిగా మార్చాలని రైతులు ఉన్నతాధికారులను కోరుతున్నారు. దీంతో డాక్టర్‌తో పాటు వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు మంజూరవుతాయి అంతేగాక నూతనంగా ఒక్కటి లేదా రెండు వెటర్నరీ సబ్ సెంటర్ల ఏర్పాటుకు అవకాశం ఏర్పడుతుంది. దీంతో పశువులు, జీవాలకు పశు సంవర్ధక శాఖ విస్తృత సేవలు అందుతాయని రైతులు, జీవాల యజమానులు, ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నూతన భవన నిర్మాణానికి ఆయిల్ ఫెడ్ నిధులు

మోత్కూరు మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో వెటర్నరీ సబ్ సెంటర్ నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న పశుఆరోగ్య ఉప కేంద్రం పూర్తి శిథిలావస్థకు చేరింది. దీంతో అదే గ్రామానికి చెందిన రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి తన సంస్థ నుంచి వెటర్నరీ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేశారు. దీంతో పాత గ్రామంలోని గడీ స్థలంలో నూతన సబ్ సెంటర్ భవన నిర్మాణం పనులు చేపట్టారు. స్లాబ్ లెవల్ పనులు పూర్తయ్యాయి. డాక్టర్ రూమ్, మెడిసిన్స్, స్టోర్ రూమ్, హాల్ నిర్మించనున్నారు. పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం పనులు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం వెటర్నరీ అసిస్టెంట్ పనిచేస్తున్నారు. అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది.

డాక్టర్ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నాం



దత్తప్పగూడెం వెటర్నరీ సబ్ సెంటర్‌కు డాక్టర్ పోస్టు మంజూరు కోసం ప్రయత్నం చేస్తున్నాం. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ లెటర్ ద్వారా మంత్రికి ఫైల్ పెట్టాం. సబ్ సెంటర్ భవన నిర్మాణానికి ఆయిల్‌ఫెడ్ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేశా. ప్రస్తుతం భవనం నిర్మాణంలో ఉంది. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తాను.

– కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్

సేవలు పెరుగుతాయి



డాక్టర్ పోస్టు మంజూరైతే రైతులకు, పశువులకు సేవలు పెరుగుతాయి. ప్రధానంగా సత్వర సేవలు అందుతాయి. సబ్ సెంటర్ అప్‌గ్రేడ్ అయితే సిబ్బంది పెరుగుతారు. సబ్సిడీ పథకాలు పొందడానికి రైతులు ఇబ్బందులు తొలగిపోతాయి.

– వల్లాల సంతోశ్‌కుమార్, ఇన్‌చార్జ్ మండల పశువైద్యాధికారి

ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌గా మార్చాలి



మా గ్రామంలోని వెటర్నరీ సబ్ సెంటర్‌ను ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌గా (మండల పశు వైద్యశాల) మార్చాలి. మోత్కూరు మండలంలో ఒకే వెటర్నరీ సబ్ సెంటర్ ఉంది. ఈ పాత సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేయాలి. ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి కృషి చేస్తున్నారు.

– ఎలుగు శోభ సోమయ్య, సర్పంచ్ దత్తప్పగూడెం

ఇసుక అక్రమ రవాణాను నిలిపివేయాలి



మాట్లాడుతున్న మందుల సామేల్

అడ్డగూడూరు : మండల పరిధిలోని చిర్రగూడూరు, కోటమర్తి గ్రామ శివారులోని బిక్కేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించడం నిలిపివేయాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ అన్నారు. శనివారం మండలంలోని కోటమర్తి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ చిత్తలూరి బాలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అవసరాలకు ఇసుక తరలింపునకు తాము అడ్డు చెప్పడం లేదన్నారు. ప్రభుత్వ పనులకు అనుమతి తీసుకోని వాగు నుంచి ఉదయం, రాత్రి సమయాల్లో హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. వాగులో ఇసుకను అడ్డగోలుగా తవ్వడంతో చెక్ డ్యాం నిర్మించిన నీరు నిల్వ లేకుండా పోయిందన్నారు. వెంటనే కలెక్టర్ ఈ ఇసుక అక్రమ రవాణాను రద్దు చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోలన దిగుతామని హెచ్చరించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాశం యాదమ్మ సత్యనారాయణ, వార్డు సభ్యులు, కోటమర్తి, చిర్రగూడూరు రైతులు కమ్మంపాటి ఉంపేదర్ సోమనారాయణ, సుధాకర్, అశోక్, నాగరాజు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడికి నివాళి



మాట్లాడుతున్న మందుల సామేల్

రాజాపేట : మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు చింతలపురి జనార్దన్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహానికి శనివారం డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ బాలమణి యాదగిరిగౌడ్, సర్పంచ్ బూర్గు భాగ్యమ్మ నర్సిరెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ చింతలపురి వెంకట్‌రాంరెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాకళ్ల ఉపేందర్, సభ్యులు, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు తిరుమలేష్, భాస్కర్, నీరటి బాలనర్సయ్య, కోరుకొప్పుల వెంకటేశ్ గౌడ్, జశ్వంత్, నర్సింహులు, శ్రీశైలం, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

జర్నలిస్టుపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

భువనగిరి : మోత్కూర్‌లో జర్నలిస్టుపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీసీపీ రాజేశ్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కోల్పుల వివేక్, నాయకులు నర్సింహులు, మట్టయ్య, ముత్యాల జలంధర్, ఉస్మాన్ షరీఫ్, వెంకటేష్, రాజు తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల

వలిగొండ : ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి సరిపడా నిధులు 30శాతం కేటాయించాలని, విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్, ఉదయ్, అనిల్ రెడ్డి, అరుణ్, శంకర్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ధర్నా

చౌటుప్పల్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె శివకుమార్, మండల అధ్యక్షుడు రాజ్‌పెరియార్‌లు మాట్లాడుతూ రెండేళ్లుగా స్కాలర్‌షిప్స్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తీగుళ్ల శ్రీనివాస్, దాసరి ప్రకాష్, సాతిరి మనోజ్, విష్ణు, శ్రావన్, సాగర్, వెంకట్, సూర్జిత్, సాయికరణ్, పృద్వీరాజ్, సందీప్, ప్రవళిక గీత, అఖిల, పూజ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భూక్య సుశీల

తుర్కపల్లి : రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఎంపీపీ భూక్య సుశీల అన్నారు. శనివారం తుర్కపల్లి మండలంలోని గంధమల్ల గ్రామంలో ఓ రైతు ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ తోటను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే పంటల పైన అవగాహన పెంచుకోవాలన్నారు. తక్కువ నీటితో పండే పంటల వైపు మొగ్గు చూపితే రాబోయే రోజుల్లో రైతులు లాభాలు ఆర్జించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాగర్లవాణిపరమేశ్, జెడ్పీ వైస్‌చైర్మన్ బీకు నాయక్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా హార్టికల్చర్ అధికారి సైదులు, ఏఈఓ తిరుమలరావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

చౌటుప్పల్ : ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి (కేజీబీవీ) కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.4.25లక్షలతో శానిటరీ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ చైర్మన్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. అనంతరం విద్యార్థినులకు నోట్ బుక్స్, ఆల్‌ఇన్ వన్, జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భవాని, ప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు సాగర్ల లింగయ్య, రమేష్, వీరమళ్ల కార్తీక్, రామకృష్ణ, సాయి, శివ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి శతఘటాభిషేకం

భువనగిరి : పట్టణంలోని 17వ వార్డులోని శ్రీ గోవిందా క్షేత్రంలో ఏర్పాటు చేసిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహానికి శనివారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అష్టోత్తర శతఘట్టాభిషేకం, 108కలశములతో ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 11నుంచి 16 వరకు నిర్వహించే ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, ఆలయ చైర్మన్ నాయిని కృష్ణ, వైస్ చైర్మన్ సరగడ వెంకటేశ్వర్లు, నాగభూషణం, నాగేందర్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

భువనగిరి : బీజేపీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలోని వివేరా హోటల్‌లో పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా నిర్వహించిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు శృతితోకలిసి ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ లింగస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, చాడ సురేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్‌గౌడ్, అశోక్, మల్లేశం, రవీందర్, భాస్కర్, గూడూరు నారాయణరెడ్డి, ప్రదీప్‌రావు, పాల్గొన్నారు.

బాలల పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలి



భువనగిరి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నరాల నిర్మల



మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ అధికారి సైదులు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సావిత్రి

భువనగిరి : గ్రామీణ ప్రాంతాల్లో బాలల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ నరాల నిర్మల అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ చేయాల్సిన పనులు, స్నేహిత కార్యక్రమంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడుతూ సమగ్ర బాలల సంరక్షణ పథ కాన్ని క్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బీరు మల్లయ్య, ఎంపీటీసీ కృష్ణ, లలిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జయశ్రీ, ఎంపీఓ అనురాధ, ఐసీడీఎస్ అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్నేహిత అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షతన బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీర శ్రీశైలం, ఎంపీడీఓ ప్రభాకర్ రెడ్డి, ఎంపీఓ చంద్రశేఖర్, సర్పంచ్‌లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటు పడాలని ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మండల బాలల పరిరక్షణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలశంకర్, సూపరిండెంట్ చంద్రమౌళి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చట్టాలను కఠినంగా అమలు చేయాలి

ఆత్మకూరు(ఎం) : బాలికా పరిరక్షణలో భాగంగా ప్రభుత్వాలు చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలం అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో స్నేహిత-2పై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారామ్, ఎంపీడీఓ బి.యాదగిరి, ఎంపీఓ పద్మావతి, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో 'స్నేహిత' కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇందిర మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పరిమళాదేవి, ఎంపీడీఓ వీరస్వామి, ఎంపీఓ కిషన్ ఉన్నారు.

రామన్నపేట : బాలల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 7నుంచి 10వతేదీ వరకు నిర్వహించే స్నేహిత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం కోరారు. స్నేహిత కార్యక్రమంపై ప్రజాప్రతినిధులకు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గాదె జలేందర్‌రెడ్డి, సీడీపీఓ శాగంటి శైలజ, మండల కోఆర్డినేటర్ చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ శివరాజ్, సర్పంచ్‌లు శిరీషాపృథ్వీరాజ్, నర్సింహరెడ్డి, యాదయ్య, యాదయ్య, సతీష్ పాల్గొన్నారు.

వలిగొండ : గ్రామాల్లో బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని స్థానిక ఎంపీపీ నూతి రమేశ్ సూచించారు. శనివారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గుండాల : స్నేహిత కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల, గ్రామ స్థాయిలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ జి.శ్రీనివాసులు సర్పంచ్లను కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ పి.జనార్దన్‌రెడ్డి, సీడబ్ల్యూసీ మెంబర్ మల్లేశం, పీఎస్‌ఐసీ కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీమ్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు : బాలికలు, కౌమార దశలో ఏర్పడే అవకాశాలు, హక్కులపై అవగాన కలిగి ఉండాలని జెడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి అన్నారు. శనివారం మండల పరిధిలోని కంచనపల్లి గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో వాయిస్ ఫర్ గర్ల్స్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 8, 9వ తరగతి కౌమార దశలో ఉన్న విద్యార్థినులకు బాలిక అవకాశాలు, హక్కులు, సాధికరతలపై పదిరోజుల పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంజయ్య, ఎంపీడీఓ చంద్రమౌళి, పాఠశాల ప్రిన్సిపాల్ జె.సరిత, ఆయోధ్య , వీరస్వామి అంజయ్య పాల్గొన్నారు.

తుర్కపల్లి : బాలలపై జరుగుతున్న వేధింపులు, దాడులను అరికట్టాలని ఎంపీపీ భూక్య సుశీల రవీందర్ నాయక్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో రెండో విడత స్నేహిత కార్యాక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల స్పెషల్ ఆఫీసర్ శ్యాంసుందర్, ఎంపీడీఓ ఉమాదేవి, ప్రాథమిక డాక్టర్ సుధీర్ రెడ్డి, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోత్కూరు : రాజ్యాంగంలో కల్పించిన హక్కులతో పాటు ప్రభుత్వాలు కల్పించిన హక్కులపై బాలికలు అవగాహన పెంచుకోవాలని మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని కేజీబీవీలో 'వాయిస్ ఫర్ ఫోర్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 7, 8, 9వ తరగతులకు చెందిన విద్యార్థినులకు హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్మలాజ్యోతి, పల్లవి, అనూషాబరద్వాజ్, స్రవంతి, కృతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



రాజాపేట : పారుపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



వలిగొండ : స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



భువనగిరి : ఉపాధ్యాయులుగా విద్యార్థులు

వలిగొండ : మండలకేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియట్ జిల్లా అధికారిని చిలుక రమణి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమమైన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ప్రభాకర్, ఏ ఎస్ఐ శ్యామ్ సుందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ కాంత్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని పారుపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యాబోధన చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా ప్రశాంత్, డీఈఓగా జీ స్పందన,, ఎంఈఓగా కే శ్రీకర్, ప్రధానోపాధ్యాయులుగా బీ.సంజనలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల స్వరూప రామచంద్రారెడ్డి, కాలె నర్సింహులు, ప్రధానోపాధ్యాయుడు పీ రాంప్రసాద్, ఉపాధ్యాయులు టీ శ్రీహరి, జీ రవళి, ఆర్ భావిక, ఆర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

భువనగిరి : పట్టణంలోని బీచ్ మహాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధన చేశారు. అధికారుల వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు మేడి భాస్కర్, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, రామచంద్రం, వెంకట్‌రెడ్డి, లక్ష్మీ, జ్యోతి, హేమలత, పీఈటీ రఘువీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

భువనగిరిటౌన్ : ఇందిరమ్మ కాలనీలోని సర్వే నంబర్ 107లో ఇళ్ల పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు స్థలాలు చూపించాలని కోరుతూ మున్సిపల్ మాజీ చైర్మన్ కొలుపుల కమలాకర్ శనివారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. రెండు విడుతల వారీగా లబ్ధిదారులకు మంజూరు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ నేటికి వారికి స్థలం చూపించలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, కోటయ్య, ఉన్నారు.

పశువులను కాపాడుకోవాలి

చౌటుప్పల్ : పశువులను సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకోవాలని నేలపట్ల గ్రామ సర్పంచ్ చౌట వేణుగోపాల్ అన్నారు. దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పశువైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో 33ఆవులు, 139గేదెలు, 189మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు వల్లూరి వెంకటరాజు, ఎస్.సాయికృష్ణ, రైతులు, తదితరులు ఉన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు విరాళం

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో మే నెలలో నిర్వహించే బొడ్రాయి ప్రతిష్ఠాపన కోసం మండల కేంద్రానికి చెందిన తవిటి వెంకటేశ్వర్లు రూ.25వేల విరాళం సర్పంచ్ జెన్నాయికోడె నగేశ్‌కు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యాస కవిత, ఉప సర్పంచ్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి

భువనగిరిటౌన్ : ఈనెల8, 9వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాందేవ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్య బాలాజీ, శిరీష, మందాన పాల్గొన్నారు.

అంబులెన్స్ నిర్వహణకు రూ.10వేల విరాళం

బొమ్మలరామారం : మండల కేంద్రంలో అంబులెన్స్ నిర్వహణకు సోలీపేట్ సర్పంచ్ పూడూరి నవీన్‌గౌడ్ రూ.10వేల విరాళాన్ని శనివారం ఎంపీడీఓ సరితకు అందజేశారు. మండల ప్రజలకు అత్యవసర సమయంలో వైద్యసాయం అందించేందుకు తన వంతుగా సాయం చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, నాగినేనిపల్లి సర్పంచ్ బట్కీరు బీరప్ప, ఉప సర్పంచ్ జూపల్లి భరత్ కుమార్ ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం

బొమ్మలరామారం : ప్రభుత్వ విద్య బలోపేతానికి దాతల సహకారం అభినందనీయమని సర్పంచ్ వడ్లకొండ అరుణ ఆనంద్ అన్నారు. బొమ్మలరామారం మండలంలోని మైలారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం దివీస్ ల్యాబొరేటరీ అందజేసిన డీ ఫ్లోరైడ్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిద్దెంకి బాబు, మచ్చ తిరుపతి గౌడ్, శ్రీశైలం, రాజు, వాడీ టీచర్ సుల్తానా, ఉపాధ్యాయ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని సర్వేలు గ్రామానికి చెందిన అనాథలైన అక్కా చెల్లెల్లు తేజ, కృష్ణవేణిలకు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ శనివారం రూ. 20,000 ఆర్థికసాయం అందజేశారు. కృష్ణవేణి చదువు బాధ్యత పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టెల భిక్షపతి, గుండె మల్లేష్, కట్కూరి లక్ష్మణ్, వీరమళ్ల భాస్కర్, ఫౌండేషన్ సభ్యులు మహేష్, రామకృష్ణ, నరేందర్ రెడ్డి, నవీన్‌రెడ్డి, జహంగీర్, నవీన్, కార్తీక్ తదితరులున్నారు.